**కథ**

# కల్పన

విజయవాడ నుండి రాజమండ్రి వెళ్తున్న ఆ ప్యాసింజర్ ఉంగుటూరు స్టేషన్లో ఆగింది.

ఆ స్టేషన్‌కే దిష్టిపోయేటట్లుగా అత్యంత ప్రత్యేకతతో చేతిలో, వాడేసిన 'సిమెంట్ బ్యాగ్'తో కుట్టిన రెండురూపాయల సంచీనిండా పట్టినన్ని బట్టలతో కంపార్ట్‌మెంట్ ఎక్కుతున్న ఆమెను ఓ వంద జతకళ్ళు వింతగా పరిశీలించి ఫక్కున రాబోయే నవ్వును ఆపుకున్నాయి.

**నా హజ్‌బెండ్ మా మేరేజ్ కి చేయించిన నెక్లెస్ యిది. నగలు పెట్టుకుని ప్రయాణం చేయకూడదు అని ఆయన చెబుతూనే ఉన్నారు. అనవసరంగా రైల్లో ప్రయాణం చేసి మాట అనిపించుకునే యోగం నా మొహాన ఉంటే ఆయన చెప్పిన మంచి మాటలు నా బుర్రకెందుకు ఎక్కుతాయి? నాకు తగిన శాస్తే జరిగింది. ఈ నెక్లెస్ లేకుండా నేను వెళ్తే రేపటికి నా శవమే మిగుల్తుంది.**

నల్లని గుండ్రాయిలా ఉన్న ఆమె స్థూల శరీరంపై నెమళ్ళ వెండిజరీ అంచు బెత్తెడు వెడల్పు ఉన్న కాషాయరంగు చీర పెద్ద ఆంజనేయస్వామికి చుట్టిన బట్టలా ఉంది. మనిషి లావుగా ఉన్నా చక చకా పైకి ఎక్కుతున్న ఆమె శరీర భాగాలన్నీ అదురుతూ కనిపిస్తున్నాయి. అదేరంగు మాచింగ్ జాకెట్‌తో నుదుట రూపాయికాసంత ఎర్రని కుంకుమతో కళకళలాడిపోతున్న ఆమెలో నవ్వితే తళుక్కుమని మెరిసే తెల్లని పలువరుస చీకట్లో కూడా ఆమె ఉనికిని తెలియచేసేలా ఉంది. రెండు చేతులకి ఎరుపురంగు మట్టిగాజులు నిండుగా ఉన్నాయి!

ఆమె మెడలో మంగళసూత్రం, మూడుపేటల చంద్రహారాలు, వాటిపైన మెడచుట్టూ తళాతళా మెరిసిపోతున్న రంగురంగుల రాళ్ళు పొదిగిన కొత్తిమీరకాడ డిజైన్‌తో చేసిన ఓల్డ్‌మోడల్ నెక్లెస్ ఆమె పెద్దలనుంచి ఆమెకు సంక్రయించినట్టుగా స్పష్టంగా తెలుస్తోంది.

ఆమె వెనుకనే ఆమెను అనుసరిస్తూ రైలెక్కిన అందమైన యువజంట కూడా మరీ మరీ చూడాలనిపించేలా ఉండడమే ఆమెను అందరూ వింతగా పరిశీలించడానికి మరో కారణం! వారి కలయిక ఘటవాద్యానికి తోడైన తబలా వాద్యంలా ఉంది.

కంపార్ట్‌మెంట్ ఖాళీగానే ఉంది, ఆషాడమాసం వల్ల కాబోలు. ఆమె కిటికీ వైపు త్రీసీటర్‌లో కూర్చుంది. ఆమె ఎదురుగా చూడముచ్చటైన ఆ జంట కూర్చున్నారు.

ట్రైన్ కదలడంతో ఆ కుదుపులకు ఒకళ్ళమీద ఒకళ్ళు పడి ఎదుటివాళ్ళు అసూయపడేంత అన్యోన్యతను ప్రదర్శిస్తున్న ఆ జంట చర్యలని ఆమె ఆసక్తికరంగా పరిశీలించసాగింది.

చెమటతో విపరీతంగా ఆమె జాకెట్టు తడిసిపోవడంతో రైలెక్కిన ఒకరిద్దరు ఆమె ప్రక్కన కూర్చోబోయి ఆమె 'పల్లెటూరు వాసన' భరించలేక కాబోలు లేచి ప్రక్క కూపేలోని సీట్లలోకి వెళ్లిపోయారు.

ఆమె నుదుటిమీద ఎర్రని కుంకుమ చెమటకు తడిసి ముక్కుమీదగా కారుతోంటే శుభ్రంగా నూనె రాసి నొక్కి నొక్కి దువ్వి బిగించివేసుకున్న ఆమె గిరజాల జుట్టు జడలో ఎర్రని కనకాంబరాల మాలతో శనీశ్వరుడికి చెల్లెలు అవతరించినట్టు అనిపిస్తోంది.

''ఎక్కడికి వెళుతున్నారు ఆంటీ మీరు?'' తీగలాంటి కంఠధ్వనితో ఆ అమ్మాయి అడిగింది.

''చాగల్లు వెళుతున్నానమ్మా! మరి మీరు?''

''మేం రాజమండ్రి వెళుతున్నాం ఆంటీ. మీరు చాలా వెరైటీగా చాలా బాగున్నారు. మీ పేరు?'' సంతోషంతో ఆమె ఎద పొంగినట్లుగా ఆమె నిటారుగా సర్దుకుని కూర్చుంది.

''మంగతాయారు''

''ఆంటీ పేరు బాగుంది కదండీ!'' ఆమె గారం గునుస్తూ అడిగింది భర్తని.

''నీకు అందరూ అందంగా కనిపిస్తారు. నీ మనసు అటువంటిది. అందుకే అయ్ లవ్ యూ టూమచ్'' ఆమె బుగ్గమీద చిటికె వేశాడతను.

''ఛీ! ముందు ఆంటీ ఉన్నారు'' మత్తుగా అంటూనే ఆడది అంత అందంగా సిగ్గుపడాలన్న మాట అని సాటి ఆడదానికి నేర్పేటంతగా సున్నితంగా సిగ్గుపడింది ఆమె.

''ఏ వయసు ముచ్చట ఆ వయసుది. మీ వయసులో మావారు కూడా యిలాగే చిలిపిగా ఉండేవారు'' ఆమె ఒక కాలు పైకెత్తి కూర్చుని అంది తల దించుకుని.

వాళ్ళిద్దరూ నవ్వేశారు. అతను గలగలా ఆమె కిలకిలా.

''ఇపుడు మాత్రం మీకేం వయసు మించిపోయింది ఆంటీ. మహా ఉంటే సింపుల్‌గా నలభై ఏళ్ళు ఉంటాయేమో అంతేగా!''

''అబ్బే! నా వయసెంతమ్మా. పధ్నాలుగేళ్ళకే పెళ్ళి చేసేశారు. మూడేళ్ళు వరుస కాన్పులతో శరీరం లావెక్కిపోయిందిగానీ వయసులో ఉండగా కేబుల్ వైరులా సన్నగా ఉండే నన్ను చూసి ఆయన సరిగా నిద్రపోయేవారుకాదు. నాకు నిద్రపట్టనిచ్చేవారుకాదు!'' అమాయకంగా అంది. ''నాకు యిద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. అమ్మాయిలిద్దరికీ పదవ తరగతి పూర్తవకుండానే పెళ్ళిచేసేశారు. అబ్బాయి కాలేజీలో చదువుతున్నాడు. ఇపుడు చిన్నమ్మాయిని చూడడానికి 'చాగల్లు' వెళుతున్నాను. మా అల్లుడు అక్కడ షుగర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు'' తన వివరాలన్నీ వాళ్ళు అడగకుండానే చెప్పిందామె.

''మీరెంతవరకూ చదువుకున్నారాంటీ?'' అతను అడిగాడు.

''ఏదో వానాకాలం చదువు బాబూ. చదవడం, వ్రాయడం వచ్చు''

ఇంతలో ఆమె అతని చెవిలో ఏదో గుసగుసలాడింది.

''అదేంటి డాళింగ్. నీకు నచ్చింది నేను ఏనాడైనా కాదన్నానా? అలాగే. తప్పనిసరిగా చేయిస్తానులే. అయినా మనలాంటివాళ్ళకి అంతటి ఖరీదైన నగలెందుకు చెప్పు!'' అతను అనునయిస్తున్నట్టుగా చెప్పిన దానికి ఆమె తన దానిమ్మ చెక్కిళ్లు ఎరుపెక్కేలా బుంగ మూతి పెట్టింది.

మంగతాయారు కల్పించుకుంది.

''అదేమిటి బాబు అలా అంటావు. ఆడవాళ్ళకి నగలే అందం. మావారిని ఎన్నాళ్ళనుంచో పోరితే ఈసారి వచ్చిన పంట డబ్బుతో ఈ చంద్రహారం చేయించారు. ఈ నెక్లెస్ మా అత్తగారు పెళ్ళికి పెట్టారు. ఎలా ఉన్నాయి?''

''ఆ నెక్లెస్ గురించే ఆంటీ మీ అమ్మాయి బూరె బుగ్గలు పెట్టింది. ఆ డిజైన్ తనకి చాలా నచ్చిందట. అచ్చం అలాంటిదే చేయించి పెట్టమంటోంది. మీకు అభ్యంతరం లేకపోతే ఓసారి యిస్తే డిజైను పేపరుమీద నోట్ చేసుకుని యిస్తాను'' అన్నాడతను.

మంగతాయారు పొంగిపోయింది ఆమెను తనకు కనని కూతుర్ని చేసినందుకు.

''అబ్బే ఆయన అలాగే అంటారు ఆంటీ. మీరు తీయకండి!'' ఆమె వారించింది.

''తప్పేముందమ్మా! మా అమ్మాయి అడిగితే


యివ్వనూ? చూడడంలో తప్పేముంది'' మంగతాయారు నెక్లెస్ తీసి ఆమెకి యిచ్చింది.

నిజంగా అద్భుతంగా ఉంది ఆ నగ! ఎక్కడ ఏ రాయి ఎపుడు మెరవాలో అనిపించేలా అమర్చిన రాళ్ళ అమరిక, ఆ నగ చేసిన వ్యక్తి కళాతృష్ణకి అద్దం పడుతోంది!

ఆమె దాన్ని అపురూపమైన వస్తువుగా సున్నితంగా అందుకుని కళ్ళకద్దుకుంది. పది నిముషాలు దంపతులిద్దరూ దానిని పరిశీలిస్తూ ఉండిపోయారు.

వారి మౌనానికి భంగం కలిగిస్తూ ''ఓసారి పెట్టుకుని చూడమ్మా! లక్ష్మీదేవిలా ఉంటావు'' అంటూ తనే లేవబోయింది ఆమె మెళ్ళో దాన్ని అలంకరించడానికి.

''నేను పెడతానులెండి ఆంటీ'' అతను అంటూనే దాన్ని ఆమె మెడలో అలంకరించాడు.



ఆమె పర్సులోంచి మినీ మిర్రర్ తీసుకుని చూసుకోసాగింది.

ఆమె మేని రంగులో కలిసిపోయిన ఆ నెక్లెస్‌లోని రాళ్ళుమాత్రం కిటికీలోంచి పడుతున్న సూర్యకాంతికి వింత వింత రంగులతో ధగధగా మెరిసిపోతూ 'వీనస్ దేవతలా' ఉందామె!

ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని పెదవుల కానించుకున్నాడతను.

''నగల కోసం ఆడవాళ్ళు ఆరాట పడేదెందుకో నాకు యిపుడు అర్థం అయింది డాలింగ్. ఆడవారికి నగలు అందాన్నిస్తాయేమోగాని నీవల్ల నగ అందం విలువ కట్టలేనంత పెరిగింది'' అతను తృప్తిగా అన్నాడు.

సిగ్గుతో మెలికలు తిరిగి తల వంచుకున్న మంగతాయారు ''అవునమ్మా! జమీందారు బిడ్డలా ఉన్నావు'' అంటూ మెటికలు విరిచింది.

రకరకాల కబుర్లతో-మంగతాయారు అనుభవాలతో ప్రయాణం సందడిగా సాగింది.

ట్రైన్ తాడేపల్లిగూడెంలో ఆగింది.

కంపార్ట్‌మెంట్‌లో క్షణంలో నిండిపోయింది. అంత వరకూ ముగ్గురే ఉన్న ఆ కూపేలోకి-

వేరే చోటులేక ప్రయాణికులు మంగతాయారు ప్రక్కనే తప్పనిసరి అయి నట్టు ముక్కు మూసుకుని కూర్చున్నారు.

ఎదుటి జంట ఆకర్షణీయంగా చలాకీగా ఉండటంతో అందరూ ఆ జంట చర్యలను టిక్కెట్టులేని సినిమాను చూస్తున్నంత ఫ్రీగా ఆనందంగా వీక్షిస్తున్నారు.

ఇక మాట్లాడితే బాగుండదన్నట్లు మంగతాయారు కూడా గుసగుసలాడుకుంటున్నట్లు వాళ్ళు చెప్పుకుంటున్న ముచ్చట్లు పరిశీలిస్తూ ఉండిపోయింది.

''డాలింగ్ నేను యిపుడే వస్తాను'' అతను లేచి ఆమె బుగ్గమీద చిటిక వేసి బాత్‌రూమ్ వైపు వెళ్ళిపోయాడు. ఆమె చేతిలో వీక్లీలో తలదూర్చింది.

బండి నిడదవోలు దాటటం గమనించిన మంగతాయారు కొంచెం ముందుకు వంగి ఆమెని అడిగింది.

''అమ్మాయి నెక్లెస్ యిస్తావా? నేను దిగే స్టేషన్ వస్తోంది''

ఆమె మంగతాయారును, తనచుట్టూ ఉన్నవారిని వింతగా చూసింది! ఎంత వింతగా అంటే అదే మొదటిసారిగా చూస్తున్నట్టు!

వెంటనే తనను కాదన్నట్టుగా తలవంచుకుని పుస్తకంలోకి చూపు మరల్చింది.

''అదేమిటమ్మాయ్! నెక్లెస్ యివ్వమంటే అయోమయంగా చూస్తావేమిటమ్మా'' ఆమెకు అడ్డుగా ఉన్న పుస్తకం చేత్తో క్రిందికి వంచి అడిగింది.

''వాట్..వాట్ మేడం? నెక్లెస్ ఏమిటి?''

అందామె అతి చిత్రమైన కంఠధ్వనితో-మర్యాదపూర్వకంగా.

''అదేమిటమ్మా! ఇందాక ఉంగుటూరులో నాతో బండి ఎక్కాక ఈ మోడల్ నెక్లెస్ చాలా బాగుంది. డిజైన్ చూసి ఓసారి నోట్ చేసుకుని యిస్తాను అని అడిగి తీసుకున్నావు కదమ్మాయ్''

''వాట్! నేనేమిటి? మీ నెక్లెస్ తీసుకోవడం ఏమిటి? ఐ డోంట్ నో హు ఆర్ యూ!'' అందామె తీవ్రంగా.

''అమ్మో అమ్మో! నాకు పెద్ద చదువులు రావని యింగ్లీషులో ఏదేదో వాగేసి నా నెక్లెస్ కొట్టెయ్యాలని చూస్తున్నావా! నా నెక్లెస్ నాకిస్తావా లేదా'' ఆమె హిడింబిలా సీట్లోంచి లేచి నడుం బిగించింది.

ఆ అమ్మాయి ఏమీ భయపడలేదు సరికదా కూల్‌గా అంది కూర్చుని.

''మర్యాదగా మాట్లాడు! నా నెక్లెస్ నేను పెట్టుకుంటే నీదగ్గర కొట్టేయడం ఏమిటి? నాకు దొంగతనం అంటగడుతున్నావా జాగ్రత్త! మా ఆయన అసలే మంచివాడు కాదు!''

**కొత్తపల్లి ఉదయబాబు**

గుండాగినంత పనైంది మంగతాయారుకి. దాంతో కంగారుతోపాటు బి.పి కూడా పెరిగిపోయినట్టుంది. ఆమె కళ్ళు ఏ క్షణాన అయినా విచ్చిపోయే కొత్తకుండల్లా ఉన్నాయి. రొప్పుతూ ఆయాసంతో కంపార్ట్‌మెంట్‌లో ఉన్నవాళ్ళతో అంది.

''అయ్యా! చూడండి బాబూ ఈ అన్యాయం. నేను ఉంగుటూరులో ఆ నెక్లెస్ పెట్టుకుని రైలెక్కాను బాబు! వేరే ఎక్కడా చోటే లేనట్టు ఈ అమ్మాయి, ఈవిడగారి మొగుడూ కూడా నా ఎదురుగా కూర్చున్నారు. రైలంతా ఖాళీగా ఉండడంతో యిక్కడ మేం ముగ్గురమే ఉన్నాం తప్ప వేరెవరూ లేరు. నాతో ఆమాట ఈమాట కలిపి వాళ్ళిద్దరూ నా వివరాలన్నీ తెలుసుకుని 'నెక్లెస్ బాగుంది ఆంటీ! ఓసారి యిస్తే డిజైన్ చూసి యిచ్చేస్తాను' అని అడిగి తీసుకున్నారు బాబు. ఈ నెక్లెస్ నాకు మా అత్తగారు యిచ్చింది. అది లేకుండా యింటికి వెళ్తే మా ఆయన నన్ను చంపేస్తాడు. మీరైనా న్యాయం చెప్పి యిప్పించండి బాబూ!'' అంది వేడుకుంటున్నట్టుగా.

ఇంతలో ఓ పెద్దాయన, రీసెంట్‌గా రిటైర్ అయినట్టున్నాడు-హుందాగా ఉన్న ఆయన అడిగాడు ఆ అమ్మాయిని.

''అదేమిటమ్మా! ఆ పెద్దావిడ అంతలో గోల పెడుతుంటే నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుంటావేంటి? ఆవిడ నెక్లెస్ తీసుకుని తిరిగి యివ్వకుండా అదేం పని!''

''వాట్ అంకుల్! మీరు..మీరు కూడా ఆవిడ మాటలు నమ్ముతున్నారా? నా హజ్‌బెండ్ మా మేరేజ్‌కి చేయించిన నెక్లెస్ యిది. ఈరోజుల్లో ఎవర్నీ నమ్మకూడదు. నగలు పెట్టుకుని ప్రయాణం చేయకూడదు అని ఆయన చెబుతూనే ఉన్నారు. నా ఖర్మ కాకపోతే కారు కూడా యిపుడే చెడిపోవాలా! అనవసరంగా రైల్లో ప్రయాణం చేసి మాట అనిపించుకునే యోగం నా మొహాన ఉంటే ఆయన చెప్పిన మంచి మాటలు నా బుర్రకెందుకు ఎక్కుతాయి? నాకు తగిన శాస్తే జరిగింది. ఈ నెక్లెస్ లేకుండా నేను వెళ్తే రేపటికి నా శవమే మిగుల్తుంది. నాకే పాపం తెలీదు. ప్లీజ్ అంకుల్ నన్ను నమ్మండి!'' ఆమె జాలి కళ్ళతో జవాబు చెప్పి చేతులెత్తి నమస్కరించి మోకాళ్ళ మీద తలపెట్టుకుని వెక్కివెక్కి ఏడవసాగింది!

ఆ ముసలాయన డైలమాలో పడిపోయాడు.

ఇంక లాభం లేదనుకున్న మంగతాయారు రెచ్చిపోయింది.

''ఓసి నీ మొహం మండ. ఎంతకు తెగించావే! ఎన్ని అబద్ధాలు..ఎన్ని అబద్ధాలు! నేను దొంగనా! నువ్వు పతివ్రతవా! నీ అమ్మ కడుపుకాలా! అమాయకురాలిని చేసి యింత నాటకం ఆడతారా! ఒసేయ్ ఏడి నీ మొగుడు. వాడిని పిలు. వాడి అంతు, నీ అంతు యిక్కడే తేల్చేస్తాను. నా నెక్లెస్ నాకిస్తావా యివ్వవా! లేదా గొలుసులాగి పోలీసుల్ని పిలుస్తాను'' అంటూ స్వర్గం నుండి తనకిష్టమైన సన్నివేశాన్ని చిరునవ్వుతో పరిశీలిస్తున్న 'సూర్యకాంతం'గారి ఆత్మ తనలో ఆవహించినట్టుగా ఆ అమ్మాయి జుట్టు పట్టుకోబోయింది.

పెద్దాయన రయ్యిన లేచాడు.

''ఆగవమ్మా! ఏంటి తెగరెచ్చిపోతున్నావ్! ఇందాకట్నుంచీ చూస్తున్నాను. నువ్వేలా మాట్లాడుతున్నావ్! ఆ అమ్మాయి ఎలా మాట్లాడింది! నిన్ను ఒక్కమాటైనా అందా? అలా తిడతావేంటి? అది నీ నగే అయితే యిక్కడ ఎవరినైనా సాక్ష్యం చెప్పమను. నీ నగ నీకు యిప్పిస్తాం- ఆ అమ్మాయి చేత క్షమాపణ చెప్పిస్తాం. అయినా ఆ అమ్మాయి అడిగితే నెక్లెస్ తీసి యిచ్చి మెడలో పెట్టుకునేంతవరకూ ఎందుకు చూస్తూ వూరుకున్నావు? వయసులో పెద్దదానిలా కనిపిస్తున్నావు. ఈ వయసులో దొంగతనం అంటగట్టడానికైనా, దొంగతనం చెయ్యడానికైనా సిగ్గులేదూ!'' అతను ఒక్కసారి గర్జించిన పులిలా అరిచేసరికి మంగతాయారుకు ఏం చెయ్యాలో పాలుపోలేదు.

''తిట్టడం తప్పయిపోయింది బాబూ! కానీ..కానీ అది నా నెక్లెస్సే! నా బిడ్డల మీద ఒట్టు'' అందామె గుండెలమీద రాసుకుంటూ. ఆమె కళ్ళు 'సుడిగుండం' ఏర్పడితే కురుస్తున్న వానలా వర్షించసాగాయి.

ఇంతలో రివ్వున తలెత్తిన ఆ అమ్మాయి అంది.

''ఇది తనదే అయితే యిందులో ఏ ఏ రంగు రాళ్ళు ఎన్ని ఉన్నాయో చెప్పమనండి!'' ఆమె కళ్ళు మంకెన పువ్వులా ఎర్రగా వున్నాయి.

గురిచూసి మాడుమీద కొట్టినట్టయింది- ఆ ప్రశ్నతో మంగతాయారుకి.

అవును. తనకు...తనకేం తెలుసు? ఎప్పుడూ ముచ్చటగా ఆ వస్తువు పెట్టుకోవడమేగాని అందులో ఏ ఏ రాళ్ళు ఎన్నెన్నో తనకేం తెలుసు?

ఆమె కళ్ళముందు నక్షత్రాలు మెరవసాగాయి.

''నేను చెబుతున్నా వినండి అంకుల్. దీంట్లో ఆకుపచ్చ రాళ్ళు 5, ఎర్రరాళ్ళు 9, తెల్లరాళ్ళు 11 ఉన్నాయి. కావలిస్తే చూసుకోండి'' ఆమె నెక్లెస్ తీసి పెద్దాయనకి యిచ్చింది.

ఆయన దాన్ని పరిశీలిస్తుండగా మంగతాయారు ముందుకు వంగింది.

నెక్లెస్ లాక్కోవడానికేమో అనుకున్నారందరూ!

ఆమె గుండెలు పట్టుకుని ముందుకు కుప్పకూలిపోయింది.

★★★

కథ పూర్తిచేసిన నేను సంతృప్తిగా నిట్టూర్చాను. ఫర్వాలేదు బాగానే వ్రాశాను. సెలెక్ట్ అవుతుందో లేదో! కథలో ఏమైనా లోపాలున్నాయేమోనని మళ్ళీ చదవడానికి మొదటి పేజీ తీసి ఉపక్రమించబోయేంతలో-

ఖరీదైన మైల్డ్ సెంట్ స్మెల్ నా ముక్కుపుటాలను తాకింది.

అపుడే బ్యూటీ పార్లర్ నుంచి వచ్చిన 'బాపు' బొమ్మలా నేను కూర్చున్న బెంచీకి అటుచివర్న నిలబడి ఉంది ఆమె.

''ఎక్స్యూజ్‌మి నేనిక్కడ కూర్చోవచ్చా!''

సంభ్రమంగా చూస్తున్న నేను తల పంకించాను.

జీరాడుతున్న తన పమిటను మట్టి అవకుండా కాబోలు బెంచీమీద 'వల' వేసినట్టుగా పరుస్తూ ఆమె కూర్చుంది అభినవ 'వరూధిని'లా! 'బుట్టా' ఉన్న కనకాంబరం రంగు 'కళాంజలి' శారీ ఆమె శరీరచ్ఛాయతో నువ్వా నేనా అన్నట్టు పోటీ పడుతోంది.

''మీరు కథలు వ్రాస్తుంటారా?''

''అవును. మీకెలా తెలుసు?'' ఆశ్చర్యంగా అడిగాను.

''పరిశీలనాదృష్టిగలవాడు ఎవరైనాసరే మీరు వ్రాస్తున్న ధోరణి చూసి చెప్పగలరు మీరు రచయిత అని'' ప్రకృతిలోని తెల్లని పువ్వులన్నీ విచ్చుకున్నట్టుగా నవ్విన ఆమె ముగ్ధమనోహరమైన నవ్వు నా ప్రయత్నానికి అడ్డుతెర వేసింది. ఏమనాలో తెలియక-

''మీరు...''

''నాపేరు కల్పన. మావారు యిక్కడ స్టేట్‌బాంకులో ఫీల్డ్‌ఆఫీసర్. మీ పేరు..''

''రవివర్మ. పెద్ద రచయితను కానులెండి. ఇపుడిపుడే నా రచనలు వివిధ పత్రికల్లో వెలుగు చూస్తున్నాయి.''

''ఆ..అవునవును. ఈమధ్య రెండుమూడు వీక్లీలలో చూశాను. దేంట్లోనబ్బా!''

ఆమెలో అణువణువునా శృంగారం ఉట్టిపడుతోంది.


''ఏమో బాబూ గుర్తురావడం లేదు!'' హఠాత్తుగా నాకేసి తిరిగి అడుగుతుందని వూహించని నేను తడబడ్డాను.

''ఏమిటి? అలా మత్తుగా చూస్తున్నారు'' గారంగా అడిగింది.

''నేనా! అబ్బే అదేం లేదే!''

ఇక లాభం లేదనుకుని పేపర్లు మడిచి నా ప్రక్కన పెట్టుకున్న లెథర్ బాగ్ కోసం అనుకోకుండా చేయి చాచాను.

నా బేగ్‌మీద ఆమె చేయి ఆనించి



కూర్చున్నట్టుంది. నా చేయి ఆమె చేతిమీద పడింది.

గోరువెచ్చని ఆమె స్పర్శ, పరిమళం నన్ను ఒక్క క్షణం వివశుడిని చేశాయి.

''ఆయామ్ సారీ''

''నేనే చెప్పాలి. మీ బేగ్ మీ పర్మిషన్ లేకుండా ముట్టుకున్నందుకు!''

''పర్వాలేదు'' అంటూ బేగ్ జిప్ తెరచి ఒక అరలో కథ తాలూకు పేపర్స్ పెట్టాను.

అపుడు గుర్తుకువచ్చింది నాకు.

జీతం పన్నెండువేల చిల్లర అందులోనే ఉంది.

జీతం తీసుకుని వస్తుంటే కథకు ఐడియా తట్టిన నేను యింటికి వెడితే మర్చిపోతాననే ఉద్దేశ్యంతో పార్కులో కూర్చుని వ్రాయడం మొదలుపెట్టాను. రోజూ పార్కులో ఒక గంట గడిపి 'అయిడియాలు' రెండుమూడు పోగేయడం అలవాటు నాకు.

బేగ్ ఒళ్ళో పెట్టుకుని తలెత్తి చుట్టూ పరిశీలించాను.

పార్కులో లైట్లు వేశారు. మా బెంచీమీద చెట్టునీడ పడడంతో మేం ఎక్కువమందికి కనబడే అవకాశం లేదు.

''ఏమైనా కబుర్లు చెప్పండి'' ఆమె ప్రశ్నకి ఉలిక్కిపడ్డాను.

ఆమెతో నాకు కబుర్లేం ఉంటాయి?

''మీవారు..''

''ఇప్పుడే వస్తాను నువ్విక్కడ వెయిట్ చెయ్యి అని నన్ను యిక్కడ దించి వెళ్ళారు. ఏం పనో ఏమిటో? మాతో మీ మగవాళ్ళు ఏమయినా చెప్తారా? అయినా ఉండండి చూసి వస్తాను''

ఆమె ఒక్కసారిగా లేవబోతుంటే తిమ్మిరెక్కింది కాబోలు, కాలు ముందుకు వేస్తూనే తూలి పడిపోయింది పాపం.

''అరెరె ఎందుకండీ అంత కంగారు'' అన్నాను గబగబా దగ్గరగా వెళ్ళి.

''కొంచెం హెల్ప్ చేస్తారా! ప్లీజ్''

బేగ్ ఒక చేత్తో పట్టుకుని ఆమెకు కుడిచేయి అందించాను.

పురుషత్వం ప్రతిబింబిస్తున్న నా చేతిని ఆమె అపురూపంగా పట్టుకుని లేవబోయి ''అబ్బా'' అంటూ మరల పడిపోయింది.

కాలు బాగా బెణికిందనుకుంటా!

నా బేగ్ ఆమె చేతికి పట్టుకోమని యిచ్చాను. రెండు జబ్బలు గుచ్చిపట్టుకుని లేవదీశాను.

ఆమె నన్ను తీగలా అల్లుకుపోయింది మళ్ళీ తూలి పడకుండా.

నన్ను నేను సంబాళించుకుని ఆమె నడుం మీద చేయి వేసి, మరో చేత్తో ఆమె జబ్బ పుచ్చుకుని మరో అయిదడుగులు నెమ్మదిగా నడిపించాను. ఆమె నెమ్మదిగా నిలదొక్కుకుంది.

మేం లైటు వెలుగులోకి వచ్చాం.

''ఇప్పుడు నేను ఒక్కత్తినే నడిచి చూస్తాను'' ఆమె నా బేగ్‌ను తన గుండెలకు హత్తుకుని పది అడుగులు నెమ్మదిగా కుంటుతూ నడిచి ఫౌంటెన్ వద్ద గట్టుమీద ఒక్కక్షణం ఆగి వెనుతిరిగి చూసింది పర్వాలేదన్నట్టుగా.

అమ్మయ్య అనుకున్నాను. అంతలోనే-

ఆమె ఫౌంటెన్ దాటి వడివడిగా అడుగులు వేయసాగింది.

నా గుండెలు ఝల్లుమన్నాయి. నా కేష్ బేగ్!

''ఏమండీ కల్పనగారూ! ఆగండి నేనూ వస్తున్నాను.''

దాదాపుగా పరుగెత్తాను.

ఆమె పరుగెత్తబోయింది. మరో నిముషంలో గేటు దాటేసేదే!

వాచ్‌మెన్ ఆమె చేతిలో బేగ్, ఆమె పరుగు చూసి లాఠీ పట్టుకుని గేటుకు అడ్డంగా నిలబడకపోతే!''

''చూడు వాచ్‌మెన్. ఆయనెవరో నావెంట పడుతున్నాడు'' అందామె నా బేగ్ తన కొంగులో దాచుకుంటూ.

నాకు ఆ రెండు నిముషాలలోనే కంగారుతోపాటు ఆయాసం కూడా వచ్చేశాయి.

అతను నన్ను కూడా ఆగమన్నట్టు చెయ్యి పైకెత్తాడు.

ఇంతలో చుట్టూ జనం మూగారు.

''ఏమిటమ్మా విషయం'' నిదానంగా అడిగాడతను.

''చూడు వాచ్‌మెన్! మావారు పనిమీద బయటకు వెళ్తూ నన్ను యిక్కడ వెయిట్ చెయ్యమన్నారు. ఈయనెవరో ఒంటరిగా ఉన్న నాదగ్గరకు వచ్చి వెకిలి వేషాలేస్తుంటే భయపడి పరుగెత్తుకు వచ్చాను'' ఆమె కమల నయనాలు భయంగా రెపరెపలాడాయి.

''ఏంటి సార్! ఏమిటి సంగతి? నిజమేనా?'' అతను కన్నుకొట్టి అడిగాడు.

''అంతా అబద్ధమోయ్! ఆమే నా పర్సు తీసుకుని పారిపోతోంది''

''ఎందుకండీ అబద్ధాలాడతారు. వయసులో పెద్దవారిలా కన్పిస్తున్నారు. ఇది మావారి పర్సు. చెప్పానుగా ఆయన బయటకు పనిమీద వెళ్తూ నాకిచ్చి వెళ్ళారు'' అందామె తొణక్కుండా.

''నో వాచ్‌మెన్. అది నా పర్సే. అందులో నేను యిపుడే వ్రాసిపెట్టుకున్న కథ కూడా ఉంది. కావలస్తే తీసుకుని చూడవోయ్'' అన్నాను మరింత ధీమాగా.

ఆమె మాట్లాడలేకపోయింది. వాచ్‌మెన్ ఆమె దగ్గరనుంచి నా బేగ్ లాక్కున్నట్టుగా తీసుకుని జిప్ తీయబోతున్నంతలో ఆమె రివ్వున బయటకు పరుగెత్తి రెడీగా ఉన్న హీరోహోండా మీద కూర్చోవడం- దానిమీదనున్న వ్యక్తి మరుక్షణం దానిని తూటాలా ముందుకు దూకించడం రెండు క్షణాలలో జరిగిపోయింది. ఆ వెలుతురులో బైక్ నంబరు నోట్ చేద్దామనుకునేంతలోనే సందులోకి తిరిగిపోయింది.

వాచ్‌మెన్ నవ్వుతూ పర్సు నా చేతికిచ్చాడు.

''అయినా మీరెలా పడ్డారబ్బాయిగారు. మీరు రోజూ పార్కుకి రావడం, ఏదో వ్రాసుకుని వెళ్ళిపోవడం నాకు తెలుసుకాబట్టి సరిపోయింది. జాగ్రత్త అబ్బాయిగారు! ఈరోజుల్లో ఎవర్నీ నమ్మమని లేదు''

నాకష్టార్జితం నాకు దక్కించిన అతనికి మనసులో ధన్యవాదాలర్పిస్తూ జేబులోంచి యిర్వై తీసి అతని చేతిలో పెట్టి ''పిల్లలకి ఏమైనా పట్టుకెళ్ళవోయ్'' అని సంతోషంగా బయటపడ్డాను.

ఇంటికి వచ్చాక జీతం తీసి దాస్తుంటే నేను వ్రాసిన కథే (కల్పన) నాకు ఎదురైన అనుభవం రూపంలో వెక్కిరిస్తూ కనిపించింది.

☆

